

మహాభారత స్రవంతిలో
తెలుగింటకొచ్చిన
ద్రౌపది
డా॥ ఎం.వి
రమణారెడ్డి

మహాభారత స్రవంతిలో

# తెలుగింటి కొచ్చిన ద్రౌపది


రచన:

డా॥ ఎం.వి.రమణారెడ్డి



ప్రచురణ:

డా॥ఎం.వి.రమణారెడ్డి,

ప్రొద్దుటూరు.

## మహాభారతప్రవంతిలో తెలుగింటికొచ్చిన ద్రౌపది

తొలి ప్రచురణ: ఏప్రిల్ 2010

హక్కులు: రచయితవి.

వెల: రు.100/-

ముఖచిత్రం: బాపు

ముద్రణ:
సారథి ప్రెస్, ప్రొద్దుటూరు.
ఫోన్ నెం. 08564-252046.

ప్రతులకు:
డా॥ఎం.వి.రమణారెడ్డి,
రాయవరం, ఖాదరాబాదు (పి.ఒ.),
ప్రొద్దుటూరు - 516362.
ఫోన్.నెం. 08564-251133.

Writers Email: mallelaramanareddy@yahoo.com
or mallelaramanareddy@rediffmail.com

Published by:
Dr.M.V.Ramana Reddy, Khadarabad P.O.,
Proddatur-516362.

# మన్నన

ప్రపంచ సాహిత్యంలో 'ఇతిహాసం' స్థానం అద్వితీయమైనది. మాతృకలేగాక అన్యభాషల్లో సైతం అవి బహుళజనాదరణ పొందుతున్నాయి. ఇతిహాసాలలో భారతదేశానిది అగ్రస్థానం. ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రాచీనమైన ఇతిహాసం ఏది అంటే 'గిల్‌గమేష్' అని పాశ్చాత్యవిద్వాంసులు కొందరు అంటారుగానీ, అది రుజువుకు నిలువదు. క్రీస్తుపూర్వం రెండువేల సంవత్సరాల నాటిదని పాశ్చాత్యులే అంటారు. రామాయణ భారతాలు నిస్సందేహంగా అంతకు పూర్వానివి. పాశ్చాత్యుల మరో మంచి ఇతిహాసం హోమర్ రచించిన ఇలియడ్. ఇందులోని ఇతివృత్తం కూడా క్రీస్తుపూర్వం పన్నెండు, పదమూడవ శతాబ్దాల నాటిది. భారతీయేతిహాసాలు ప్రపంచవ్యాప్తంగా బహుభాషలలో వెలువడ్డాయి. ఏ భాషలో వెలువడినప్పటికీ మన ఇతిహాసాలు వాసి చెడలేదు, వన్నె తగ్గలేదు. వివిధ ఇతిహాస మాతృకలకు లభించిన ఆదరణనూ, వాటి అనువాదాల పట్ల ప్రజలు చూపించిన అభిమానాన్నీ పోల్చిచూస్తే, మహాభారతానికి కవిత్రయం చేసిన ఆంధ్రానువాదం పొందిన గౌరవం మరి ఏ మాతృకగాని, అన్యభాషలలో వెలువడిన అనువాదాలుగానీ పొందలేదని స్పష్టమవుతుంది. అది నిస్సందేహంగా మహాభారతానువాదం చేసిన కవిత్రయం ఘనత.

'జయం' అనే పూర్వనామం కలిగిన మహాభారతం పంచమవేదంగా ప్రసిద్ధం. అంతగా ప్రచారంలోకి రాని మరో పేరు 'కార్ష్ణ వేదం.' కృష్ణ సంబంధమైనది గనుక కార్ష్ణం. కృష్ణ అంటే ద్రౌపది. కురుక్షేత్ర మహాసంగ్రామం గురించీ, దాని ముందువెనుకల జరిగిన పరిణామాలను గురించీ తెలియజేసేది మహాభారతం. రామాయణ యుద్ధానికి కారణం

సీత కాగా, మహాభారత యుద్ధానికి దారితీసిన పరిణామాలలో ద్రౌపదిదే ముఖ్యపాత్ర. ఇలియడ్‌లో ట్రాయ్ యుద్ధం సైతం హెలెన్ కోసమే జరిగింది. ద్రౌపది కారణంగా మహాభారతాన్ని కార్‌ష్ణవేదం అనడం సార్థకమే.

సంస్కృత మూలాన్ని మించి ఆంధ్రమహాభారతం గొప్ప పేరు తెచ్చుకోడానికి కారణం కవిత్రయం చేసిన మార్పులూ చేర్పులూ మాత్రమేగాక, వారు అనువాదంలో పాటించిన పద్ధతులూ, మెలకువలూ కూడా. కవిత్రయ భారతం చదువుతున్నప్పుడు అది ఎక్కడో ఉత్తరదేశంలో జరిగినట్టు తోచదు. తెలుగునాట మన మధ్యనే జరిగిన అనుభూతి కలుగుతుంది. కవిత్రయం, మరీ ముఖ్యంగా తిక్కన, పాత్రలను శిల్పించిన తీరూ, పాత్రల మధ్య నడచిన సంభాషణలూ అలాంటి భావన కలిగిస్తున్నాయి. వందల సంవత్సరాలుగా ఆంధ్రమహాభారతాన్ని చదువుతున్న తరాలు మారుతున్నాయేగాని తెలుగు ప్రజలకు దీనిని చదివిన అనుభూతి నాటికీ నేటికీ ఒక్కటిగానే ఉంది. అందువల్లనే సాహిత్య పరిశోధకులకూ, మహాభారతాభిమానులకూ ఈ విశేషం పరిశీలనయోగ్యమైనది. మహాభారతంలో కీలకపాత్ర ద్రౌపదిదే కనుక, ఆమెను తెలుగింటి ఆడపడుచుగా దర్శించి, తన అనుభూతిని ఈ గ్రంథంలో మనతో పంచుకుంటున్నారు డాక్టర్ ఎం.వి.రమణారెడ్డిగారు. నిజమే. వివిధ సన్నివేశాలలో ద్రౌపది స్పందించిన విధానం, వ్యవహరించిన తీరు, మాట్లాడిన పద్ధతి తెలుగింటి ఇల్లాలినే స్ఫురణకు తెస్తుంది ‘‘తెలుగింటికొచ్చిన ద్రౌపది’’ చదువుతున్నప్పుడు.

డాక్టర్ ఎం.వి.రమణారెడ్డి వైద్యశాస్త్రంలో పట్టభద్రుడు. ఎం.బి.బి.ఎస్. చదవినప్పటి హెన్రీ గ్రే ‘అనాటమీ’ పుస్తకంలో ఎన్ని శరీరాంతర్గత అస్థి, నాడి మొదలైన భాగాల పేర్లు ఇప్పుడాయనకు జ్ఞాపకం ఉన్నాయో తెలీదుగానీ, సంఖ్యలో అంతకు మించిఉన్న మహాభారత పాత్రల పేర్లు,

అందులోని స్థలాల పేర్లు అన్నీ ఆయనకు తెలుసు. ఎన్నిసార్లు చదివారో గాని, మహాభారతంలోని ముఖ్య ఘట్టాలలో పద్యాలు ఆయనకు కరతలా మలకం. ఆంధ్రమహాభారతాన్ని ఆపోసనం పట్టి, సంస్కృత భారతాన్ని ఎరుక కలిగించుకుంటేనేగాని ఇంతటి నిశిత పరిశీలన సాధ్యంగాదు. నన్నయ, ఎర్రాప్రగడ, తిక్కనలలో ఎవరు ఏ పాత్రలను ఎలా చిత్రించారో సాధర్మ్య పరిశీలన చేసిన రమణారెడ్డిగారికి ముగ్గురిమీద గౌరవాభిమానాలు ఉన్నాయిగాని, తిక్కనమీద ఆయన అభిమానం పాలు ఎక్కువ. అది సహజమే. అనివార్యం కూడా. మహాభారతం ఆంధ్రీకరణను మదింపు చేయడంలో తిక్కనను తక్కువచేసినవారూ, కీర్తించనివారూ కనిపించరు. ద్రౌపది మూర్తిమత్వ చిత్రణలో తిక్కనకు కలిగిన అవకాశం మెండు. సభాపర్వంనుంచి అరణ్యపర్వంలో తను వ్రాసినమేరకు నన్నయ శిల్పించిన ద్రౌపదిపాత్ర ఎర్రాప్రగడ పూరించిన అరణ్యపర్వ శేషభాగంలో పరిణామం చెందడం మొదలై, తిక్కన విరాట, ఉద్యోగ పర్వాల్లో పూర్ణత్వం పొందుతుంది. రమణారెడ్డిగారు “నన్నయ వ్రాసిన అరణ్యపర్వంలో ద్రౌపదికి పెద్దగా ప్రాముఖ్యం కనిపించదు” అని వ్యాఖ్యానించారు. నిజమే. “తెలుగుభాషకు నన్నయ కావ్యగౌరవం కలిగించగా, తిక్కన దానికి సాహిత్య సామర్థ్యాన్ని సాధించారు” అని ఆయన విశ్లేషణ. తిక్కనకు ఉన్న ఆ సాహిత్యసామర్థ్యమే ద్రౌపదిని తెలుగింటి ఆడపడుచుగా మలిచింది. రమణారెడ్డిగారి మరికొన్ని వ్యాఖ్యలుగూడా తిక్కన సాహిత్య సామర్థ్యాన్ని విశదీకరిస్తాయి. “తెలుగు పదాలను పలికించడం కాకుండా, తెలుగుభాష కూకట్లను పెల్లగించింది తిక్కన కవిత్వం” అన్నారొకచోట. నన్నయ, ఎర్రనలతో పోలుస్తూ మరోచోట “ఒకటే భాష, ఒకటే భావం. ఐనా తిక్కన ద్రౌపదిలో తెలుగుదనం గుబాళిస్తుంది” అని ప్రస్తుతించారు. “తరచు ప్రాసస్థానంలో ద్విత్వాక్షరాలను వాడిన చమత్కారంతో తిక్కన తన రచనకు తెలుగుదనాన్ని సమకూర్చారు” అన్నారు ఇంకొకచోట.

అది పండిత వ్యాఖ్య. తిక్కన శిల్పించిన పాత్రలలోనే ఎందుకు అంత తెలుగుదనం కనిపిస్తుందో వివరిస్తూ మరొకచోట "తిక్కన పాత్రలు ఆలోచనకు పరిమితమయ్యేవి కావు. కళ్ళముందుకొచ్చి అభినయించేవి(!)" అన్నారు డాక్టర్ రమణారెడ్డి.

భారతీయ సాహిత్యంలో వచ్చిన పరిణామాలపై ఆలోచనీయమైన ఒక వ్యాఖ్య చేశారు రమణారెడ్డిగారు. "అదివరకటి (తిక్కనకు పూర్వం) భారతీయ సాహిత్యానికి స్త్రీలో కనిపించింది కేవలం కామోద్రేకం మాత్రమే. ఆమె సంతోషానికీ, దుఃఖానికీ, కోపానికీ, ఒకటేమిటి అన్ని ఆవేశాలకూ అదే మూలం. కామపిపాసను దాటలేని ఒక చట్రంలో ఆడమనిషిని ఇరికించింది ఆ సాహిత్యం . . . . . పదమూడవ శతాబ్దపు (తిక్కనకాలం) తెలుగుసాహిత్యం ఆ సంకుచితత్వానికి వీడ్కోలు పలికింది. స్త్రీని ఒక సంభోగసామగ్రిగా కాక, తల్లిగా, చెల్లిగా, ఇల్లాలుగా, భక్తురాలిగా నిలబెట్టి, అనేక కోణాలను ఆవిష్కరించింది." ఇలా యావత్తు భారతీయ సాహిత్యాన్ని దృశ్యంలోకి తెచ్చి, "ఈ పరిణామంలో తిక్కన పాత్ర ఉన్నది కనుక ఆయనకు భారతజాతి రుణపడి పోయింది" అన్నారు డాక్టర్ రమణారెడ్డి.

దేశ కాల పరిస్థితులతోపాటు సాహిత్యంలోనూ పరిణామాలు వస్తున్న మాట నిజమే కానీ, ప్రకృతి సహజమైన కొన్ని మనోధర్మాలు ఏదోవొక రూపంలో వ్యక్తమవుతున్న మాటకూడా కాదనటానికి వీలులేని యథార్థం. ద్రౌపదివంటి శీలవతులు అప్పుడున్నట్లే ఇప్పుడూ ఉన్నారు. కానీ ఆమెను కామదృష్టితో చూసిన సైంధవులూ, కీచకులూ, ఆమె వస్త్రాలను ఒలిచి అవమాన పరచాలని ప్రయత్నించిన దుశ్శాసనులూ వర్తమానంలోనూ మనమధ్య ఉన్నారు. పురాణాల పుటలనుంచి అలాటి కులసతులను ఆధునిక సాహిత్య వీధులలోకి ఈడ్చుకొచ్చి తమదైన పశుభావ ప్రదర్శన చేస్తున్నవారూ ఉన్నారు. నాడే కాదు, నేడుగూడా ఆమె పునీతగానే

నిలుస్తుంది. సైంధవులూ, కీచకులూ, దుశ్శాసనులూ నాడేమైనారో నేడూ అదే అవుతారు. అదేమైనప్పటికీ స్థూలంగా భారతీయ సాహిత్యంలో స్త్రీకి సమున్నత స్థానం లభించే పరిణామం సాహిత్య చరిత్రకారులు గుర్తించదగింది.

ఆంధ్రమహాభారత ద్రౌపది తెలుగుదనాన్ని దృశ్యమానం చేయడానికి రమణారెడ్డిగారు వివిధ పర్వాలలోని ముఖ్యఘట్టాలన్నింటిని ఉపయోగించుకున్నారు. మరీ ముఖ్యంగా విరాటోద్యోగ పర్వాలు ఆయనకు అందివచ్చాయి. విరాటపర్వం సన్నివేశాలతో ప్రారంభించిన ఈ విన్యాసాన్ని ఆయన ఉద్యోగపర్వంలో ద్రౌపదితో సహా పాండవులు ఉపప్లావ్యానికి వెళ్ళి కృష్ణుడి మందిరంలో జరిపిన సంభాషణలలో పతాకస్థాయికి చేర్చారు. రాయబారానికి వెళ్ళమని కృష్ణుడిని అర్థించిన ఘట్టం ఇది. ద్రౌపది ఈ సందర్భంగా మాట్లాడిన తీరును ఇలా విశ్లేషించారు రచయిత -

“అచ్చం తెలుగు ద్రౌపది మళ్ళీ ప్రవేశించింది. సూటిపోటి మాటలతో వాదన మొదలెట్టింది. స్వచ్ఛమైన దేశీయపదాలతో రెచ్చిపోయింది. . . . ఉద్వేగాల పరంపరను అలలు అలలుగా పాఠకుని అంతరంగానికి తాకించడం ఆ తిక్కనసోమయాజికే చెల్లింది. . . . తిక్కన పోకడలో కనిపించేది ఉత్తరాది అంతఃపురకాంత కాదు. అచ్చం తెలుగింటి ఇల్లాలు. ఆయన గ్రంథస్థం చేసింది అన్నదమ్ముల మధ్య తలెత్తే తగాదాల్లో తెలుగునాట ఏ ఇంటిలోనైనా ఆడవాళ్ళు ప్రదర్శించే ఆవేశకావేషాలు.”

కక్షలు దండిగా ఉన్న గ్రామాలలో కుటుంబస్త్రీలు మాట్లాడే తీరు తెలిసిన అనుభవం రమణారెడ్డిగారిచేత ఈ వాక్యాలను పలికించి ఉంటుంది.

ఇద్దరు కవులు ఒక దృశ్యాన్ని చూచినప్పుడు, ఒక సన్నివేశాన్ని

గమనించినప్పుడు ఇద్దరి స్పందన ఒకేవిధంగా ఉండవలసిన అవసరం లేదు. కవుల సంస్కారం, వారి సాహిత్య నేపథ్యం వారి ఆలోచనలను ప్రభావితం చేస్తాయి. రమణారెడ్డిగారికి తెలుగుభాషమీద, తెలుగు మాట్లాడే ప్రాంతాలమీద ఉన్న ప్రేమ, అభిమానం ద్రౌపదిలో తెలుగుదనాన్ని స్వయంగా చూడడమేగాక, మనందరికీ చూపించాలనే ప్రయత్నానికి ప్రేరణ కలిగించాయి. ఎవరి దృష్టి వారిది గనుక, మరొకరిని ద్రౌపది అంగాంగ వైభవం ఆకర్షించి ఉండవచ్చు. ఆమె అంతరంగంలో తిక్కన చెప్పని ఆలోచనలు తోచవచ్చు. ఒక రచయిత ఆమెలోని ధీరోదాత్త లక్షణాలను ప్రస్తుతిస్తే, మరొకరు ఆమెను రక్తపిపాసిగా చూడవచ్చు. ద్రౌపది అభిచారక్రియవల్ల జన్మించిన కృత్య అనే సంహారకారిణి అనే కథగూడా వ్యాప్తిలో ఉంది. ఆమె ప్రతియుగంలోనూ జీవకోటి నశించటానికి కారణమయ్యే ఒక స్త్రీమూర్తిగా జన్మిస్తుందని ఇతిహాసం. ఎవరి దృష్టి వారిది అనేది అందరం ఆమోదిస్తున్న సత్యం.

రమణారెడ్డిగారు నవలాకారులుకూడా. కనుక ఆయన రచనలో హాయిగా ఒక్క బిగిని చదివించే శైలి సహజంగానే ఉంది. ప్రజలు నిత్యం మాట్లాడుకునే తెలుగు వ్యావహారికభాష మాధుర్యం ప్రతి పుటలోనూ కనిపిస్తుంది. ద్రౌపది తెలుగుదనం రచయిత ఎంచుకున్న వస్తువైనా పుస్తకం చదవడం పూర్తయ్యాక మొత్తం భారతాన్ని చదివిన తృప్తి కలుగుతుంది.

తెలుగుసాహిత్యానికి సంబంధించిన కొన్ని విలువైన అభిప్రాయాలు రమణారెడ్డిగారు ఈ గ్రంథంలో వ్యక్తం చేశారు. "విరాటపర్వం స్వయం ఒక ప్రబంధం. తెలుగుసాహిత్య పరిణామక్రమంలో తరువాత పుట్టుకొచ్చిన ప్రబంధాలకు మాతృక," "నన్నయ తిక్కనలకు (ఎర్రాప్రగడ) వారధివంటి వాడనే మన్నన శాశ్వతమై నిలిచింది," "తెలుగుభాషకు ద్విత్వం ప్రాణాధారం" లాంటివి పాండిత్యంతో కూడిన వ్యాఖ్యలు. 'బచ్చునబొమ్మ,'

'నాచికోలు,' 'కచ్చకోరు,' 'మిఱ్ఱు,' 'ముట్టుకోక,' 'కఱ్ఱోడు,' 'మెరమెచ్చులు' లాంటి దేశ్యశబ్దాలు రచనలో తెలుగు సువాసనలను గుబాళింపజేస్తాయి. "చేసింది వినాశనమైనా పురుషుని కార్యాన్ని సమర్థించాయి పురాణాలు" లాంటి ఆక్షేపణలూ, "ద్రౌపదిని తెలుగింటి ఆడపడుచుగా దత్తతకు తీసుకొచ్చిన పెద్దమనిషి తిక్కనే" లాంటి ప్రశంసలూ పక్కపక్కన్నే కనిపిస్తాయి.

రమణారెడ్డిగారు తెలుగింటి ఆడపడుచుగా ద్రౌపదిని తాను గుర్తించడమే గాక మనందరిచేత గుర్తింపజేయడం లక్ష్యంగా ఈ రచన చేశారు. గుర్తింపు ఒక్కటే కాదు, తెలుగింట ద్రౌపదిని పెద్దపీటమీద కూర్చోబెట్టి ఆమె అంతస్తుకు తగినవిధంగా తమ గ్రంథంతో సత్కరించారు. మహాభారత మహారాజ్ఞిగా పాంచాలికి 'పట్టాభిషేకం' చేశారు. అందుకు మనందరం ఆయనను అభినందించవలసి ఉంది.

హైదరాబాదు, **పొత్తూరి వెంకటేశ్వరరావు**
5-4-2010.

---

అలనాటి 'ఆంధ్రప్రభ' సంపాదకులుగా పొత్తూరి వెంకటేశ్వరరావుగారు ప్రసిద్ధులు.

# సవరణ:

తొలిప్రచురమ 144 వ పేజీలో 'ఆతడు నొంచునె అన్న దమ్ములన్' అని ఉండేందుకు బదులు, 'ఆతడు ఒంచునె అన్నదమ్ములన్' అని నేను విడదీసి వ్రాశాను. అక్కడ లేని ద్రుతప్రకృతిక సంధిని నేనై ఊహించి విడదీసేందుకు పూనుకోవడం పెద్ద పొరపాటు. ఆ పొరపాటుకు కారణం 'నొంచు' అనే పదం తెలుగులో ఉందని నాకు తెలియక పోవడం. 'నొంచు' అంటే నొప్పించు అనే అర్థంలో తెలుగు పదం ఉందని చెబుతూ, నా పొరపాటును ఎత్తి చూపిన శతావధాని శ్రీ నరాల రామారెడ్డిగారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు చెల్లిస్తూ, ఇందుమూలంగా పాఠకులకు క్షమాపణ చెప్పుకుంటున్నాను. 149 వ పేజీలోని మరో పద్యంలో అదే తప్పు పునరావృత్తమైంది. 'అగునట్టి ననున్ కొనివచ్చి నొంచు' అని ఉండటం సరైన పాఠం. తొలిముద్రణ ప్రతిలో వీటిని సవరించు కోవలసిందిగా పాఠకులకు నా విజ్ఞప్తి.

# 1

తెలుగు ద్రౌపది వయసు ఇప్పటికి వెయ్యి సంవత్సరాలు. మహాభారత ఇతివృత్తంలో ఆమె కథానాయిక. మహాభారతం కథలంటే తెలుగుప్రజలు చెవి కోసుకుంటారు. అందుకే తెలుగింటి లోగిట్లో ద్రౌపది మట్టియల చప్పుడు ఇప్పటికీ వినిపిస్తూనే వుంది. చోద్యమేమిటంటే, ఆమె తెలుగింటి ఆడపడుచు కాదు; కనీసం తెలుగింటి గడపలో అడుగుబెట్టిన కోడలైనా కాదు. ఎక్కడో సహస్రయోజనాల దూరంలో, ఎప్పుడో వేల సంవత్సరాలకు పూర్వం, ఉత్తర భారతదేశంలోని కురు భూమిని పాలించిన పాండుకుమారుల పట్టమహిషి ఆ ఇల్లాలు. ఐనా, తెలుగుజనం ఆమెను పరాయిదానిగా చూడరు. అందుకు కారణం అనన్యసామాన్యమైన రసపోషణతో మహాభారత కథకు తెలుగురూపం కల్పించిన కవిత్రయం.

లక్షకు పైచిలుకు శ్లోకాలతో, పద్దెనిమిది పర్వాలతో, వందలాది పాత్రల మహాకావ్యంగా, దీనికి దీటైన సాహిత్యం ప్రపంచంలో మరొకటి లేదనిపించుకున్న పరిశ్రమ సంస్కృత మహాభారతం. దాన్ని రచించడానికి వ్యాసుడు అనుసరించిన కథా సంవిధానం తీరు - 'తరువాత ఏం జరుగుతుందో, తరువాత ఏం జరుగుతుందో' అనే కుతూహలం రేకెత్తించే ఆధునిక నవలకు మాతృక వంటిది. క్రీస్తుశకం 11వ శతాబ్దంలో దీన్ని తెలుగులోకి అనువదించడానికి పూనుకున్న సాహసి నన్నయ భట్టారకుడు. ఐతే, తన జీవితకాలంలో ఆయన వ్రాయగలిగింది రెండున్నర పర్వాలు మాత్రమే. ఆయన మూలంగా తెలుగుసీమలో ద్రౌపది ప్రవేశించింది. ఆమెతో పాటు ఆమె భర్తలూ, బంధుమిత్రులు తదితర పరివారమంతా, దాయాది మత్సరాలతో సహా, తెలుగుభూమిలో దిగిపోయారు.

మూలానికి అంటిపెట్టుకుని తు,చ తప్పకుండా చేసిన అనువాదంగాదు నన్నయది. ఆమాటకొస్తే, దక్షిణాది భాషలకు భారతాన్ని అనువదించిన కవులెవ్వరు మూలానికి అంటిపెట్టుకోలేదు. సారాంశానికి భంగం రాకుండా రకరకాల మార్పులు ప్రవేశపెట్టి, దక్షిణాదిలో పదికాలాలపాటు అది బ్రదికేలా చేశారు. ఆ కోవలోనే నన్నయ తనకు అనుచితంగా తోచిన భాగాలను వదిలేశాడు; విపులంగా ఉండా లనుకున్న తావుల్లో కథను విస్తరించాడు. ఐతే, నన్నయ దృష్టి పాత్రల రూప కల్పనమీదికంటే, వైదిక ధర్మాల ప్రచారం మీదనే ఎక్కువగా వాలింది. అందువల్ల, నన్నయ భారతంలోని పాత్రల లక్షణాలు సంస్కృతానికి భిన్నంగా కనిపించవు.

తొలిదశలోనే ఆగిపోయిన తెలుగుభారతాన్ని పూర్తిజేయగల దిట్ట, ఆ తరువాత

రెండువందల సంవత్సరాలకుగాని పుట్టలేదు. 13వ శతాబ్దంలో నెల్లూరు మండలాన్ని పాలించిన మనుమసిద్ధి ఆస్థానంలో మంత్రిగా పనిజేసిన తిక్కన సోమయాజి ఇందుకు నడుం బిగించాడు. అసంపూర్తిగా మిగిలిన అరణ్యపర్వం వదిలేసి, నాలుగవదైన విరాటపర్వం మొదలుగా తక్కిన పదిహేను పర్వాలు ఆయన పూర్తిజేశాడు. అదే కథ, అదే మూలం; కానీ, మొక్కుబడిగా నడిచిన కొనసాగింపు కాదు. తిక్కన ప్రణాళిక వేరు, అభిరుచి వేరు, శిల్పం వేరు, సంకల్పం వేరు. నిజానికి, ద్రౌపదిని తెలుగింటి ఆడపడుచుగా దత్తతకు తీసుకొచ్చిన పెద్దమనిషి ఈయనే.

రచనలో 'తెలుగుదనం' చొప్పించడం తిక్కన అభిమతం. తెలుగు మాటలు ఉపయోగించినంత మాత్రాన తెలుగుదనం సమకూరదు. కూర్పుకు తెలుగు 'నుడికారం' జతపడాలి; పాత్రలకు తెలుగు నడవడిక నేర్పించాలి. అందుకు తిక్కన ప్రధానంగా ఎన్నుకున్నవి స్త్రీ పాత్రలు. కథానాయిక అయినందున ద్రౌపది ఆయన ప్రయత్నానికి తగిన ముడిసరుకు. తిక్కన ద్వారా జరిగిన సాంస్కృతిక సమ్మేళనం కారణంగా, ప్రతి తెలుగు మనసు భారతాన్ని సొంతం చేసుకుంది. అదేదో తన ఇంటిపట్టున జరిగిన కథగా భావించింది. ఎక్కడో యమునానది తీరంలో జరిగిన కురుక్షేత్ర సంగ్రామాన్ని పెన్నానది తిన్నెల మీద జరిగినంత దగ్గరికి తీసుకొచ్చిన ప్రతిభ తిక్కనబ్రహ్మది.

ఈ సందర్భంలో, అక్షరజ్ఞానమైనా లేని పామరుని నోటంటా భారతాన్ని ఆలాపింపజేసిన తిరుపతివేంకటకవులను గుర్తుచేసుకోవడం ఆత్మగౌరవం. తమ 'పాండవోద్యోగ విజయాలు' నాటకం వల్ల వారు తెలుగునేల మీది మారుమూల పల్లెల్లో సైతం మహాభారతాన్ని మారుమ్రోగించారు. మహాభారతంలోని పాత్రల స్వభావాలను ఆపోసన పట్టిన అగస్త్యుడు తిక్కన కాగా, ఆ తిక్కననే ఆపోసన పట్టిన ఉద్దండులు తిరుపతివేంకటకవులు.

అసంపూర్తిగా మిగిలిన అరణ్యపర్వాన్ని మరో నూరేళ్ళ తరువాత ఎఱ్ఱాప్రగడ పూరించాడు. తన సొంత అభిప్రాయాలను పక్కకు నెట్టి, నన్నయ శైలిలో, నన్నయ పేరుమీదే, భారతాన్ని సంపూర్ణం చేసిన త్యాగశీలి ఎఱ్ఱన.

నన్నయ వ్రాసిన ఆదిపర్వంలోనే ద్రౌపది పాత్ర పాఠకులకు పరిచయమౌ తుంది. కానీ, ఆ పర్వంలో ఆమె ఉలుకూ పలుకూ లేని బచ్చెనబొమ్మ. పాంచాల దేశాన్ని పాలించే ద్రుపదుడనే రాజుకు కూతురు. ఆ ద్రుపదుడు ఒక సందర్భంలో ద్రోణుడనే బ్రాహ్మణున్ని చులకన చేస్తాడు. అస్త్రవిద్యలో ఆరితేరిన ఆ ద్రోణుడు

ప్రతీకారాన్ని నిరీక్షిస్తూ హస్తినాపురం చేరుకుంటాడు. పిల్లల విద్యాభ్యాసానికి యోగ్యత గల గురువుకోసం ఎదురుచూస్తున్న భీష్ముడు అతనికి ధృతరాష్ట్ర పాండు కుమారులను అప్పగిస్తాడు. విద్యను పూర్తిజేసుకున్న విద్యార్థులతో పాంచాలరాజును బంధించి తీసుకురావటం తనకు గురుదక్షిణగా కోరుకుంటాడు ద్రోణుడు. అందుకు పూనుకున్న రాకుమారులందరిలో, పాండవ మధ్యముడైన అర్జునుడు మాత్రమే అతని కోరిక చెల్లించగలుగుతాడు.

అర్జునుని ప్రతాపానికి ముగ్ధుడైన పాంచాలుడు, ఆ వీరుణ్ణి అల్లునిగా చేసుకోవాలని ఉబలాటపడతాడు. కానీ అతనికి కూతురు లేదు. అర్జునుణ్ణి పెళ్ళాడే కూతురూ, ద్రోణున్ని నిర్జించే కుమారుడూ కావాలని పుత్రకామేష్టి చేస్తాడు. రామాయణ కథలో దశరథుడు చేసిన యజ్ఞంలో లాగా ఇక్కడ పాయసం రాలేదు. నేరుగా ఒక అబ్బాయి, అమ్మాయి యజ్ఞకుండంలోనుండి పుట్టుకొస్తారు. అబ్బాయి కవచ కిరీటాలతో రథం తోలుకుంటూ బయటికొస్తాడు. సొగసులో నల్లకలువతో సమానమైన అమ్మాయి తదనంతరం వెలువడుతుంది. మామూలుగా చదివినప్పుడు, మహాభారతకథలో అనేకచోట్ల సందర్భానుసారంగా కనిపించే వింతల్లో ఇదీ వొకటి అనిపిస్తుంది. కానీ, ఈ అద్భుతం కథకుని చాకచక్యానికి నిదర్శనం. ఎందుకంటే - ద్రుపదుణ్ణి ఓడించిన అర్జునుడు అప్పుడప్పుడే కౌమారాన్ని దాటుకుని యవ్వనంలో ప్రవేశిస్తున్నాడు. అతని ఈడుకు సరిపడే కుమార్తెను పొందగలిగితేనే ద్రుపదుని యజ్ఞం సార్థకమౌతుంది. అలాగాక, భార్యకు పాయసం తాపించి తీరుబాటుగా కూతురును కనమంటే కుదిరే పనిగాదు. అందువల్ల -

> కుల పవిత్ర, సితేతరోత్పల కోమలామల వర్ణ, ఉ
> త్పల సుగంధి, లసన్మహోత్పల పత్రనేత్ర, అరాళ కుం
> తల విభాసిని, దివ్యతేజము తాల్చి వొక్క కుమారి త
> జ్వలన కుండమునందు పుట్టె ప్రసన్నమూర్తి ముదంబుతోన్.

ఆమెకు అమ్మానాన్నా పెట్టిన పేరేదో తెలీదుగానీ, ద్రుపదుని కూతురు గాబట్టి 'ద్రౌపది' గానూ, ఆ ద్రుపదునికి యాజ్ఞసేనుడనే మరో పేరుగూడా ఉందిగాబట్టి 'యాజ్ఞసేని' గానూ, పాంచాల దేశవాసి గాబట్టి 'పాంచాలి' గానూ, నల్లటిది గాబట్టి (పైపెచ్చు అదే పేరును ఆకాశవాణిగూడా ప్రకటించడంతో) 'కృష్ణ' గానూ తదుపరి కథలో పిలిపించుకుంటుంది. ఈ తొలిపరిచయం తరువాత తిరిగి ఆమె కనిపించేది తన స్వయంవరం రోజున. అర్జునుడు అందుబాటులో ఉంటే స్వయంవరం ప్రకటించే అవసరమే ద్రుపదునికి కలిగేది కాదు. కానీ, లక్క ఇంటిలో తల్లి కుంతిదేవితో

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=807**

* * *